ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 114 | చీఫ్ ఎడిటర్.. కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, | పేజిలు : 08, వెల రూ. 1/- | సోమవారం - 25 - మే - 2026




## ఎబోలా ఎఫెక్ట్.. ఎయిర్‌పోర్టులపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ

అమరావతి: ఆఫ్రికాలో ఎబోలా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. కాంగో, ఉగాండా, సూడాన్ నుంచి వచ్చేవారికి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించింది. విశాఖ, తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎబోలాపై అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఓడరేవులతో పాటు రోడ్డు మార్గాల్లోనూ దృష్టి సారించాలని చెప్పారు. వైరస్ లక్షణాలున్న వారిని క్వారంటైన్ చేస్తామని మంత్రి తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్యం

### ఏఐ సాయంతో వైద్యం.. 'సంజీవని' సేవలనుప్రత్యక్షంగా వీక్షించిన చంద్రబాబు

- ★ రోగి నమోదు నుంచి మందుల పంపిణీ వరకు డిజిటల్ ప్రక్రియను పరిశీలన
- ★ ఏఐ ఆధారిత వైద్యం, వర్చువల్ కన్సల్టేషన్ విధానాలను ప్రత్యక్షంగా వీక్షించిన సీఎం
- ★ సాంకేతికతతో వైద్యులకు డాక్యుమెంటేషన్ భారం తగ్గి రోగులపై శ్రద్ధ పెరిగిందని వెల్లడి
- ★ కుప్పం, బెంగళూరు నిపుణులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహణ



అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్య సేవలు అందించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు జిల్లాలో పర్యటించారు. యాదమరి మండలంలోని 'సంజీవని' ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న డిజిటల్ వైద్య సేవల పనితీరును స్వయంగా సమీక్షించారు. టెక్నాలజీని అనుసంధానించి సామాన్యులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే అంశాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఒక రోగి పీహెచ్‌సీకి వచ్చినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని వెళ్లేంత వరకు జరిగే మిగతా 2 లో

## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే


2లో

వైఎస్ కుటుంబ రక్త చరిత్ర తెలిసే.. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్న నారాయణ

అమరావతి: వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో




## విశాఖలో ఘనంగా బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణ

- బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం ఆవిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
- ప్రజల ఆశీర్వాదాలే తన బలమన్న దత్తాత్రేయ

# గోదావరి పుష్కరాలకు రూ.వేయి కోట్లు

### వేగంగా పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ




క్యూర్ పరిధిలో పేదలకు లక్ష గృహాలు

- ➤ 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..

పాలమూరుకు రూ.587 కోట్లు

హైదరాబాద్: తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. పూరిగుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని మిగతా 2 లో



## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి

ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు

పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు



## ఆ కులాల పేర్ల మార్పునకు ఆమోదం

- ▶▶ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం
- ▶▶ బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ
- ▶▶ రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం
- ▶▶ బీసీ కులాల్లో గ్రూప్--ఏ లోని వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులాన్ని శివ క్షత్రియగా మార్పు
- ▶▶ వరుస సంఖ్య 7లోని దొమ్మర అనే పదాన్ని తొలగించి గడ వంశీయగా మార్పు

హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్న అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కులాల పేర్ల మిగతా 2 లో

## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు

హైదరాబాద్: రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ. 45వేల కోట్లు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. "తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు. వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేదు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.



# తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు

### మరో మూడు రోజులు తీవ్ర వడగాలులు



హైదరాబాద్/అమరావతి: రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణంక కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... దీనికితోడు వడగాలులతో ప్రజలు అక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనెల 26 వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ మంచి ర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, అయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి,హైదరాబాద్ జిల్లాల్లో త్రీవ వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెరిపింది. మిగతా 2 లో

## తమిళనాడులో ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. కోటి కుటుంబాలకు సున్నా బిల్లు!

తమిళనాడులో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు రంగం సిద్ధం

వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచే ఈ పథకాన్ని వర్తింపజేయనున్న ప్రభుత్వం




తమిళనాడు: తమిళనాడులో గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకాన్ని మిగతా 2 లో

## రష్యా భీకరదాడులు.. నలుగురి మృతి, 50 మందికి గాయాలు

### ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున దాడులు

- ఇళ్లకు, పాఠశాలలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం
- ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి శబ్ద వేగం కన్నా 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది
- కీవ్ బయట చెర్కాసీ, ఖార్కివ్, క్రోపీవ్నిట్స్కీ, ఒడెసా, పోల్టావా, సుమీ, జైటోమిర్ ప్రాంతాలపైనా దాడులు



కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున దాడులు చేసింది. కొన్ని వందల డ్రోన్లు, డజన్లకొద్దీ క్షిపణులను ప్రయోగించింది. కీవ్ నగరంతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నలుగురు మృతిచెందగా, మరో 50 మందికిపైగా మిగతా 2 లో

## హార్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి

: అమెరికాతో ఇరాన్ డీల్?... అమెరికా, ఇరాన్ మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి చర్చలు

హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ సుముఖత


2లో

ఢిల్లీ: అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి

## బలూచిస్థాన్‌లో రక్తపాతం.. పాక్ సైనికులు వెళుతున్న రైలుపై ఉగ్రదాడి.. 24 మంది మృతి

ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

## మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు: మార్కో రూబియో

ఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి న్యూఢిల్లీలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో పలు విషయాలను పంచుకున్నారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార దాడులపై రూబియో స్పందించారు. అమెరికా సమాజంలోని జాత్యహంకారమే ఈ దాడులకు కారణమనే వాదనను తోసిపుచ్చారు. "ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారు, కొన్ని సంఘటనల ఆధారంగా మొత్తం దేశాన్ని అంచనా వేయలేము" అని వ్యాఖ్యానించారు. అమెరికాలో భారతీయ సమాజం అత్యంత విజయవంతమైన, గౌరవప్రదమైన సమాజంగా ఉందని, వ్యాపారం, సాంకేతికత, వైద్య రంగాల్లో అద్భుతంగా రాణిస్తోందని కొనియాడారు. మరోవైపు, ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి రాబోయే కొన్ని గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందని రూబియో వెల్లడించారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడికి ప్రతిస్పందనగా ఇరాన్ చాలా వరకు దిగ్బంధించిన హోర్ముజ్ జలసంధిపై ఉన్న ఆందోళనలను ఈ కుదురుతున్న శాంతి ఒప్పందం పరిష్కరిస్తుందన్నారు. ఇరాన్ అణ్వాయుధం గురించి ఇకపై భయపడాల్సిన అవసరం లేని ప్రపంచంలోకి మనం అడుగుపెట్టబోతున్నామని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌తో శాంతి చర్చలపై పాజిటివ్ పోస్ట్ చేసిన నేపథ్యంలో రూబియో వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## విజయ్ గెలుపు ఒక 'సినిమా సునామీ'.. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు: స్టాలిన్

తమిళనాడు : తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని... కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు. టీవీకే పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్ అయిన 118 సీట్ల మార్కును దాటడంలో పూర్తిగా విఫలమైందని గుర్తుచేశారు. కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయిన ఆ ప్రభుత్వం, ఈ రోజు డీఎంకే కూటమిలోని పార్టీల మద్దతు వల్లే మనుగడ సాగిస్తోందని, ఏ క్షణమైనా ఈ ప్రభుత్వం కూలిపోవచ్చని హెచ్చరించారు. డీఎంకేను చీల్చేందుకు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి విఫలమయ్యాయని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు మొదట టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మాత్రమే మద్దతు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత క్యాబినెట్‌లో చేరడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి అత్యంత అస్థిరంగా ఉందని వ్యాఖ్యానించారు.

## విశాఖలో ఘనంగా బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణ

అమరావతి: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత ప్రస్థానాన్ని ఆవిష్కరించే 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ సభ విశాఖపట్నంలో అత్యంత వైభవంగా జరిగింది. విశాఖ మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ అవలోకన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దత్తాత్రేయ రాజకీయ జీవితం, ఆయన చేసిన ప్రజా సేవ, సామాన్య ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ... సామాన్య ప్రజల మధ్య నుంచి ఎదిగి, గవర్నర్ వంటి అత్యున్నత పదవిని అధిరోహించిన బండారు దత్తాత్రేయ జీవిత ప్రయాణం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎదురైన క్షేత్రస్థాయి అనుభవాలు, ప్రజలు అందించిన ఆశీర్వాదాలే తన జీవితానికి అసలైన బలమని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజలతో ఉన్న ఆ బంధం వల్లే ఈ పుస్తకానికి 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పేరును ఖరారు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడి ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ఈ పుస్తకం ద్వారా రాబోయే తరాలకు అందుబాటులోకి రానుంది.

## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే

అమరావతి: వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ బాగా తెలుసని, జగన్ అండ్ కో ఎన్ని అసత్యాలు మాట్లాడినా జనం నమ్మే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. వైఎస్ కుటుంబం, వైసీపీ రక్తచరిత్ర ప్రజలకు తెలుసు కాబట్టే... గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, వచ్చే ఎన్నికల్లో వారికి సున్నా (జీరో) సీట్లు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈరోజు నెల్లూరు జిల్లాలో నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించి, ఎలాంటి అవినీతి లేకుండా నిజాయతీగా ఉద్యోగాలను కేటాయించిందని స్పష్టం చేశారు. ఇంత మంచి జరుగుతుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై జగన్ అండ్ కో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఈసారి హైబ్రిడ్ విధానంలో (ప్రత్యక్షంగా, వర్చువల్ గా) మహానాడు ఉంటుందని... గతంలో మాదిరే రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఈ వేదికపై మాట్లాడే పూర్తి అవకాశం కల్పిస్తామన్నారు. తన పర్యటనలో భాగంగా నెల్లూరు పరమేశ్వరనగర్ వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న మున్సిపల్ కార్పొరేట్ స్కూల్ ప్రాంతాన్ని నారాయణ సందర్శించారు. సామాన్య ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయంగా, స్విమ్మింగ్ పూల్‌తో సహా అన్ని రకాల ఆధునిక వసతులతో ఈ పాఠశాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో నగరంలోని పలు మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మారుస్తున్నామని, అలాగే ఏపీలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 1,400 కోట్లతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. మంత్రి పర్యటనలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

హైదరాబాద్: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# గోదావరి పుష్కరాలకు రూ.వేయి కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని తీర్మానించింది. జూన్ 1 నుంచి ఇందిరమ్మ పథకం రెండో విడత కింద పేద కుటుంబాలకు 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరుకు అనుమతించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ 2వ తేదీ నాటికి దాదాపు లక్ష గృహ ప్రవేశాలు జరగాలని నిర్ణయించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించింది. వివరాలను రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి వెల్లడించారు. "కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ప్రారంభిస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరం అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం. వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించాం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని సూచించింది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు; గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తాం. సొంత స్థలాలున్న వారికి రూ.ఐదేసి లక్షలు ఇస్తాం.

### లైఫ్ సైన్సెస్ విధానానికి ఆమోదం

తెలంగాణను 2030 నాటికి ఐదు ప్రపంచ శ్రేణి లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని మంత్రిమండలి ఆమోదించింది. దావోస్‌లో సీఎం ఈ విధానాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తాం. పరిశోధన, అభివృద్ధి యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ విధానంలో మార్పు తెచ్చాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

### ఇతర ముఖ్య నిర్ణయాలు..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్ల కేటాయింపు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1,000 కోట్ల కేటాయింపు. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరు.

రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లు మార్క్‌ఫెడ్‌లో విలీనం. రాష్ట్ర సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థ హాకాలో విలీనం. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 శాశ్వత బోధన, 6 బోధనేతర, 3 పోస్టులు పొరుగు సేవల కేటగిరీలో మంజూరు. కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి 18 పోస్టులు మంజూరు. అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా వెల్దిలో 4, రుక్మాపూర్‌లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపు. పంట ఉత్పత్తుల కొనుగోలు...: మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు రాష్ట్ర మంత్రి మండలి శనివారం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే 14.89 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతించింది. ఇంకా నిల్వలున్నందున అదనంగా 6,53,817 టన్నుల కొనుగోళ్లకు రూ.1,677 కోట్ల రుణం అవసరమని, దానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని మార్క్‌ఫెడ్ ప్రతిపాదించగా ఆమోదం లభించింది. 2,76,277 టన్నుల జొన్న కొనుగోళ్లకు రూ.1,154.76 కోట్ల రుణం కోసం, 10,175 టన్నుల పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు రూ.86.37 కోట్ల రుణం కోసం ప్రభుత్వ బ్యాంకు గ్యారంటీలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది" అని మంత్రి పొంగులేటి వివరించారు.

### ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు...

విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించాం. ఇది కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదు. గత ప్రభుత్వం 2017 జనవరి 2న అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. దీనిని అమలు చేయలేదు. దీనిపై రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘంగా చర్చించాం. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దీనిపై వివరంగా మాట్లాడారు. విద్యుత్‌రంగానికి పరిశ్రమలు, గృహాలు, రైతులకు మేలు చేసే ఈ పథకంలో ఇప్పటికే అన్ని రాష్ట్రాలు చేరాయి. దీనిని అమలు చేయాలని నిర్ణయించాం.

## గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్యం

మొదటి పేజీ తరువాయి

పూర్తి ప్రక్రియను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ముందుగా, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ) డెస్క్ వద్ద డిజిటల్ పద్ధతిలో రోగి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవల మ్యాపింగ్ వంటి అంశాలను అక్కడి సిబ్బంది సీఎంకు వివరించారు. అనంతరం పీహెచ్‌సీ డ్యాష్‌బోర్డును పరిశీలించి, రోజువారీగా నమోదవుతున్న మొత్తం రిజిస్ట్రేషన్లు, కన్సల్టేషన్ల వివరాలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ట్రాక్ చేస్తున్న విధానంపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్‌కు వెళ్లి, రోగుల బీపీ, ఎత్తు, బరువు, శరీర ఉష్ణోగ్రత, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి కీలక వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇక్కడి నుంచి అత్యంత కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని వీక్షించారు. మెడికల్ ఆఫీసర్ ఒక రోగి పాత ఆరోగ్య చరిత్రను సేకరించడం, నర్సులు నమోదు చేసిన వివరాలను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్‌తో వ్యాధి నిర్ధారణకు సహకారం తీసుకోవడం వంటివి లైవ్‌లో ప్రదర్శించారు. ఈ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం గణనీయంగా తగ్గి, రోగులపై ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ ప్రక్రియలను కూడా సీఎంకు చూపించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని సందర్శించిన చంద్రబాబు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రోగులకు వేగంగా మందులు పంపిణీ చేస్తున్న విధానాన్ని చూశారు. చివరిగా, పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి 'సంజీవని' ప్లాట్‌ఫామ్ ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రి, బెంగళూరులోని టాటాఎండీకి చెందిన నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వైద్య అంతరాలను తగ్గించడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పనితీరును అభినందించారు.

## తమిళనాడులో ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నాకు చేరనుంది. ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీసుకున్న ఈ తొలి కీలక నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌పీడీసీఎల్) తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. ప్రభుత్వ నూతన విధానానికి అనుగుణంగా అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి మార్పులను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచినట్లు టీఎన్‌పీడీసీఎల్ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం రెండు నెలలకు 500 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్ల లోపు వాడే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య ఏకంగా 1.2 కోట్లకు పెరగనుంది. మరో 85.83 లక్షల మంది వినియోగదారుల బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ. 235 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, 500 యూనిట్లకు మించి వాడే 34.24 లక్షల మందికి మాత్రం పాత పద్ధతిలోనే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగుతుంది. ఈ పథకం ద్వారా అయ్యే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. మే 10న ప్రభుత్వం ఈ ప్రకటన చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రక్రియను ప్రారంభించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా ఈ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి

మొదటి పేజీ తరువాయి

దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం. ఆక్సియోస్ కథనం ప్రకారం ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. అయితే, ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు 'ఆక్సియోస్' పేర్కొంది. కానీ, ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని 'న్యూయార్క్ టైమ్స్' కూడా నివేదించింది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ.. అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ ఒకవేళ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

## రష్యా భీకరదాడులు.. నలుగురి మృతి, 50 మందికి గాయాలు

మొదటి పేజీ తరువాయి

నలుగురు మృతిచెందగా, మరో 50 మందికిపైగా గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఆ ప్రాంతమంతా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇళ్లకు, పాఠశాలలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. బిలా సెర్క్వా నగరంపై జరిగిన దాడిలో ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి వాడినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఆ నగరం కీవ్ ప్రాంతంలో ఉంది. ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి శబ్ద వేగం కన్నా 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. ఉక్రెయిన్ శుక్రవారం స్టారోబిల్స్క్ పట్టణంలోని విద్యార్థుల వసతి గృహంపై దాడి చేసిందని ఆరోపించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. చెప్పినట్లే ఆదివారం దాడులు చేశారు. రష్యా దాడులు చేయడానికి ముందే జెలెన్ స్కీ మాట్లాడుతూ.. తమ దేశంపై దాడి చేసే సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు. రష్యా ఒరెష్నిక్ క్షిపణి వాడే అవకాశం ఉందని ఉక్రెయిన్ నిఘా సంస్థలకు సమాచారం వచ్చినట్టు కూడా ఆయన చెప్పారు. ఆ క్షిపణిని అడ్డుకోవడం అసాధ్యమని చెబుతున్నారు. ఉక్రెయిన్ జాతీయ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీవ్ ప్రాంతంలో 50కు పైగా చోట్ల దాడి జరిగింది. ఇళ్లు, షాపింగ్ కేంద్రాలు, అత్యవసర సేవల భవనాలు, పోలీస్ భవనాలు దెబ్బతిన్నట్టు సమాచారం. నీటి సరఫరా కేంద్రంపై కూడా దాడి జరిగినట్టు జెలెన్‌స్కీ చెప్పారు. "రాజధానిపై భారీ బాలిస్టిక్ దాడి జరిగింది. ఇంకా దాడులు జరిగే అవకాశం ఉంది" అని కీవ్ సైనిక పరిపాలన అధిపతి టిమూర్ ట్కాచెంకో టెలిగ్రామ్‌లో గత అర్ధరాత్రి తర్వాత పోస్ట్ చేశారు. కీవ్ మేయర్ విటలి తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఇద్దరు చనిపోయారు. ఇద్దరు చిన్నారులు సహా 30 మంది ఆసుపత్రిలో చేరారు. మధ్య షెవ్చెంకో జిల్లాలో 9 అంతస్తుల భవనంపై దాడి జరిగింది. పై అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. ఒకరు చనిపోయారు. అదే జిల్లాలో పాఠశాల వద్ద ఉన్న ఎయిర్ రైడ్ షెల్టర్ సమీపంలో దాడి జరిగింది. శిథిలాలు పడటంతో ప్రవేశ ద్వారం మూసుకుపోయింది. పలువురు లోపల చిక్కుకున్నారు. ఎమర్జెన్సీ సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాలకు చేరుకుని మంటలు ఆర్పారు. శిథిలాలను తొలగించారు. గాయపడిన వారికి చికిత్స అందించారు. రాజధాని చుట్టూ ఉన్న కీవ్ ప్రాంతంలో మరో ఇద్దరు చనిపోయినట్టు ప్రాంతీయ అధిపతి మైకోలా కలాష్నిక్ తెలిపారు. కీవ్ బయట చెర్కాసీ, ఖార్కివ్, క్రోపీవ్నిట్స్కీ, ఒడెసా, పోల్టావా, సుమీ, జైటోమిర్ ప్రాంతాలపైనా దాడులు జరిగాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబియా తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు

హైదరాబాద్/అమరావతి: రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణంక కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... దీనికితోడు వడగాలులతో ప్రజలు అక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనెల 26 వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ మంచి ర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, అయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి,హైదరాబాద్ జిల్లాల్లో త్రీవ వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెరిపింది. ఈ మేరకు ఈ జిల్లాలకు ఆరెంజె అలర్ట్ జారీ చేసింది. రాత్రిపూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 30 డిగ్రీల మేర ఉంటాయని వివరించింది. రాష్ట్రంలో అత్యవరంగా ధర్మపురి మండలం బుద్ధిశపల్లిలో 48.3 డిగ్రీల సెల్సియస్ ఇష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రం. లోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు చురుకుగా నైరుతి రుతుపవనాలు నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులు శీలిస్తే గరిష్ఠ ఉష్ణోగ్రత అమ్మంలో 44.8 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలలోకి విస్తరించమన్నాయి. ఈనెల 26న కేరళలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతా వరణ శాఖ తెలిపింది. నైరుతి బిహార్, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్ర వాహత ఆవర్తనం శనివారం జార్ఖండ్ ఉత్తర రత్తీస్ గఢ్, ఒడిశాల మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. అది, సోమవారాల్లో రాష్ట్రంలోని తూర్పు ఉత్తర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్గాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రంలోని 95 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడు జిల్లా శ్రీనగర్‌లో 45 డిగ్రీలు, ఎన?టఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, నేడు (ఆదివారం) 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని 214 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45, 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ?చమ గోదావరి, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42--44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40--42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందని విపత్తుల శాఖ తెలిపింది. దీని ప్రభావంతో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, మన్యం, అల్లూరి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## ఆ కులాల పేర్ల మార్పునకు ఆమోదం

హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్న అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కులాల పేర్ల మార్పునకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బీసీ కులాల్లో గ్రూప్--ఏ లోని వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులాన్ని శివ క్షత్రియగా మార్పు చేశారు. ఇదే కేటగిరీలోని వన్నార్‌ను తొలగించి ధోబీగా మార్పు చేసి రజక, చాకలి, ధోబీగా.. ఏదైనా ఒక పేరును వాడుకలోకి తీసుకోవచ్చన్నారు. వరుస సంఖ్య 7లోని దొమ్మర అనే పదాన్ని తొలగించి గడ వంశీయగా మార్పు చేశారు. వరుస సంఖ్య 18లో ఉన్న పిచ్చకుంట్ల పేరును వంశరాజ్‌గా మార్పు చేశారు. వరుస సంఖ్య 23లో ఉన్న వీరభద్రియను వీరముష్టి, నెట్టి కోటల, వీరభద్రియగా మార్చారు. గ్రూప్ డీ, వరుస సంఖ్య 5లో ఉన్న మేర కులం పేరును మేరుగా మార్పు చేశారు. వరుస సంఖ్య 29లో ఉన్న శూద్ర కులం పేరును తొలగించి తమ్మలిగా మార్చారు.

VIGNAN PATRIKA
APTEL/2024/89102
విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)




## సమాధి

ఆయుధాలు అవసరం లేని
యుద్ధం పేరు మోసం
బ్రతికుండగానే శవాన్ని చేసే
ఆయుధం పేరు మాట
వెన్నంటే ఉంటూ వెన్నుపోటు
పొడిచే కత్తి పేరు నమ్మకం
నమ్మించి నట్టింటా ముంచే
నీటి పేరు అనుబంధం
తడి గుడ్డతో గొంతులు కోసే
అస్త్రం పేరు ప్రేమ
అన్యాయాలు, అక్రమాలు చేయగలిగే
మృగం పేరు మనిషి
నీ ఆకలి ఆరాచకాలు చూడదు
నీ మరణం మూహూర్తం పెట్టుకోదు
నీ ప్రాణాన్ని ఏపుణ్యాత్ముడు కొనలేదు
నీ చావును ఏ సిద్ధాంతి ఆపలేదు
నీ దగ్గర డబ్బు ఉందనే గర్వంతో
గగనంలో పై పైకి ఎగరకు
నీకు చివరికి నీకు నేల మీద
సమాధి కట్టాలని గుర్తించుకో!
ఇలా తప్పు మీద తప్పు చేసి
నీ చావును నువ్వు కొని తెచ్చుకోకు!!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385



## ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తే..





జెవివి అద్వర్యంలో ప్రతి ఏడాది పీ.ఎస్.ఆర్ ట్రస్టు ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని దేవసేనమ్మ చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని జెవివి గూడూరు శాఖ అద్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.గూడూరు పట్టణంలోని వారి నివాసంలో జెవివి ప్రతినిధులు.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని కరణాలవీధిలో నివాసముంటున్న పారిశ్రామిక వేత్త పొణకా శివకుమార్ రెడ్డి నివాసానికి ఆదివారం జెవివి ప్రతినిధులు చేరుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జెవివి అద్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాపర్ గా వచ్చిన వారిని గుర్తించి చేతి గడియారాలు,జ్ఞాపికలు,జిప్ ఫైళ్ళు పీ.ఎస్.ఆర్ ట్రస్టు ద్వారా అందించారు.దీంతో జెవివి ప్రతినిధులు కలిసి క్రుతజ్నతలు తెలిపారుఈ సందర్భంగా సంస్ద అద్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జెవివి అద్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా చేస్తామని చెప్పినందుకు సంతోషంగా ఉందని,మరోసారి వారికి కృతజ్ఞత చెప్పుకుంటున్నామని పేర్కొన్నారు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ..ప్రతి ఏడాది తప్పకుండా జెవివి అద్వర్యంలో విద్యార్థులకు చేతి గడియారాలు,జ్ఞాపికలు అందజేయడం జరుగుతుందని,ఇదొక మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు.శివాలయంలో ధ్వజస్దంభం ఏర్పాటు చేసే అవకాశాన్ని దేవుడు కల్పించాడని, ఇది కూడా అంతేనని తెలిపారు.విద్యార్థులను ప్రోత్సహించడం తమ బాద్యతగా భావిస్తామని మాట్లాడారు ఇంకా పలువురు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు చెంచు నారాయణ,పురుషోత్తం రావు,రామ్మోహన్, ఆనంద్,ఇబ్రహీం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.ం

## వడదెబ్బకు గురై గుర్తుతెలియని వ్యక్తి మృతి



**విజ్ఞాన్ దినపత్రిక కృష్ణాజిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు :** ఉయ్యూరులో వడదెబ్బకు గురై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానిక కాటూరు రోడ్డు లోని విజయా హాస్పిటల్ సమీపాన ఖాళీ స్థలంలో ఓవ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆవ్యక్తి మృతి చెంది ఉండటం గమనించారు. వ్యక్తి వయస్సు 35 నుండి 40 సంత్సరాలు ఉంటుందని, వడద్బెకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తునట్టు తెలిపారు. చేతికి నాలుగు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి ఉన్నాయని, మెడలో ఎస్ సింబల్ కలిగిన లాకెట్ లాంటి చెయిన్ ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి ఆవ్యక్తి ఆచూకి కొరకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## గత 32 రోజులు నుండి శ్రీ సీతమ్మ జలధార పేరుతో గూడూరు లోని మార్కెట్ సెంటర్ సమీపంలో మజ్జిగ పంపిణీ చేయడం జరిగినది






గూడూరు పట్టణంలో వేసవిలో ఎండలు ఎక్కువ కావడంతో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు రాష్ట్ర కోఆర్డినేటర్ కోట సునీల్ కుమార్ స్వామి గత 32 రోజులు నుండి శ్రీ సీతమ్మ జలధార పేరుతో గూడూరు లోని మార్కెట్ సెంటర్ సమీపంలో మజ్జిగ పంపిణీ చేయడం జరిగినది. ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. అదేవిధంగా తమ ప్రాంతాలలో తప్పని పరిస్థితులలో ఎండలలో ప్రయాణం పాదచారులకు తాపం తగ్గించే నిమిత్తంగా ఇటువంటి మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని కోటా సునీల్ కుమార్ స్వామి పిలుపునివ్వడం జరిగినది, పై కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన...

ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్...





**నాగులుప్పలపాడు మండలం మే 24 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో :** నాగులుప్పలపాడు మండల పరిధిలో హెచ్.నిడమానూరు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ఆదివారం సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ముందుగా క్రీడా పోటీల నిర్వాహకులు మరియు గ్రామ కమిటీ నాయకులు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.తదుపరి రిబ్బన్ కట్ చేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్రీడా మైదానంలో రెండు ఓవర్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఎంతో ఉత్సాహంగా బ్యాటింగ్ చేశారు. కూటమి నేతలు బౌలింగ్ చేయగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేలా తనదైన శైలిలో ఎమ్మెల్యే బ్యాటింగ్ చేశారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ ను ఉద్దేశించి ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని తెలిపారు.గెలుపోటములను క్రీడాకారులు స్పోర్టీవ్ గా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా నిడమానూరు గ్రామంలో జనసేన కార్యకర్తలను ప్రశంసించారు. ఈ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కు విచ్చేస్తున్న ప్రతీ క్రీడాకారులకు మరియు జట్లకు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ జనసేన పార్టీ మంచి నీటి వసతితో పాటు, క్రీడాభిమానులకు అధికంగా టెంట్లు వేయించాలని, ముఖ్యంగా వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిడమానూరు క్రిస్టియన్ క్రికెట్ క్లబ్ కమిటీని ఎమ్మెల్యే విజయ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పైడి నాగేశ్వరరావు, కొణిజేటి ధనుష్,బాపట్ల పార్లమెంటు సాంస్కృతిక విభాగం నాయకులు నందిగం కోటేశ్వరరావు, నాగులుప్పలపాడు జనసేన పార్టీ ఉపాధ్యక్షులు ఊదరగుడి స్టాలిన్ బాబు, గ్రామ అధ్యక్షులు లక్కేనబోయిన శాంసన్, ఉపాధ్యక్షులు ఎండ్లూరి మోజేష్, ప్రవీణ్ లతో పాటు టీడీపీ నాయకులు సౌలు, రాజా, కనపర్తి శ్రీనివాసరావు మరియు క్రీడాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక గూడూరు హాషీమ్ బాబా దర్గా..

ఘనంగా గంధమహోత్సవం..

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు..

గూడూరు : పట్టణంలో వెలసి ఉన్నటువంటి హజరత్ సయ్యద్ హాషిమ్ హుస్సేనీ జాఫర్ మస్తాన్ ఔలియా వారి గంధ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో మత గురువుల ప్రత్యేక ప్రార్థనలతో పూలు విద్యుద్దీప అలంకరణములతో నందలూరు ఫకీర్ల జరబు విన్యాసములతో శనివారం రాత్రి జరిగింది ఈ గంధ మహోత్సవానికి గూడూరు పట్టణానికి చెందిన వారే కాకుండా తమిళనాడు తెలంగాణ నుండి కూడా భక్తులు విచ్చేశారు దర్గా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు రియాజ్ అహ్మద్ సారధ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు చేశారు ముందుగా



అధ్యక్షులు రియాజ్ అహ్మద్ ఇంటి నుండి గంధాన్ని ఊరేగింపుగావించి దర్గా వద్దకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు మత గురువుల ప్రార్థనల అనంతరం గంధాన్ని హజ్రత్ వారి సమాధికి



లేపనం చేశారు దర్గా పెద్ద ముజావర్ మగ్దూమ్ ప్రత్యేక దువా ఫాతేహ జరిపిన అనంతరం దర్గా ఆవరణంలో వజ్రాల తాహిర్ ఫ్రూట్ మర్చంట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ లు మాట్లాడుతూ మత సామరస్యానికి నిదర్శనం గూడూరు గంధమహోత్సవం అని అన్నారు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దర్గాను సందర్శించుకుంటూ ఉంటారని ఒకరికొకరు సోదర భావంతో కలిసి మెలసి గంధమహోత్సవంలో పాల్గొంటారని ఆనందం వ్యక్తం చేశారు, దర్గా కు విచ్చేసినటువంటి ప్రతి ఒక్కరూ క్షేమంగా వారి వారి ఇళ్లకు వెళ్లాలని వారు అనుకున్నవి అల్లాహ్ దయవలన నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. దర్గా ముజావర్ మత గురువు మగ్దూమ్ అలీషా చిష్టి ఉల్ ఖాదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గూడూరు పట్టణంలో హజరత్ సయ్యద్ హాషిమ్ హుస్సేనీ బాబా వారి దర్గా నందు బక్రీద్ మాసంలో హజరత్ సయ్యద్ హాషిమ్



హుస్సేని బాబా వారి గ్రంథం జరుగుతుందని ఈ గంధమహోత్సవానికి దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ ల సూచనల మేరకు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తుల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో గంధ మహోత్సవం జరిగిందని ముఖ్యంగా మిత్రుడు తాహిర్ పండ్ల వ్యాపారి వారికి దర్గా కమిటీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్,లయన్ రియాజ్ అహ్మద్,మగ్దూమ్,ఇలియాజ్ అహ్మద్, హఫీజ్ అహ్మద్, షానవాజ్,షిరాజ్ అహ్మద్, షబ్బీర్,యస్దాని, సందాని బాష,గోల్డెన్ గౌస్, సైదులు, మత గురువులు మగ్దూమ్ అలీషా చిష్టి ఉల్ ఖాదరి,ఖదీర్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి, దిల్దార్ అలీషా బాసిత్ తమిళనాడు, మజహార్ అలీషా అబ్దుల్లా,గౌస్ మస్తాన్ ఖాదరి,రహమాన్ అలీషా తిరుపతి,ఫర్మాన్ అలీ షా, సలీం చిష్టి,నూర్ అలీ షా, హైదర్ అలీ షా, అబ్దుల్లా, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరు గోడౌన్స్‌లో ఘనంగా ప్రారంభమైన ఈూ జిల్లాస్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్.....

- 75 జట్లతో ఉత్సాహంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన..కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి.
- క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేసిన ఎమ్మెల్యే..
- బ్యాట్ పట్టి షాట్లు ఆడిన ఎమ్మెల్యేకు యువత హర్షధ్వానాలు..
- జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన జట్లు..యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే..
- గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభకు ఈూ మంచి వేదిక క్రీడలు క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే..
- చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువతకు సూచించిన ఎమ్మెల్యే..
- క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ..

**అల్లూరు:విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి నియోజకవర్గంలోని అల్లూరు గోడౌన్స్ మైదానం ఆదివారం క్రికెట్ అభిమానులతో కిక్కిరిసిపోయింది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈూ జిల్లాస్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను కావలి శాసన సభ్యులు శ్రీ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఘనంగా ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 75 జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. భారీ ఎత్తున నిర్వహించిన ఈ టోర్నమెంట్ ప్రారంభ వేడుక అల్లూరు ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే చేరుకోగానే యువత, క్రీడాభిమానులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు.బాణాసంచా, నినాదాలతో మైదానం మొత్తం సందడిగా మారింది. అనంతరం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి క్రీడాకారులతో కలిసి మైదానంలోకి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించారు. ప్రతి జట్టు ఆటగాళ్లతో మాట్లాడి వారి ఆటతీరు,గురించి తెలుసుకున్నారు. యువతతో కలిసిమెలిసి సరదాగా గడుపుతూ ఎమ్మెల్యే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.మైదానంలో బ్యాట్ పట్టుకుని ఎమ్మెల్యే షాట్లు



ఆడగా యువకులు హర్షధ్వానాలతో ఉత్సాహపరిచారు. బౌలింగ్ చేసిన యువకులతో సరదాగా మాట్లాడటం, ఫీల్డింగ్‌లో పాల్గొనడం, ఆటగాళ్లతో ఫోటోలు దిగడం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఎమ్మెల్యే యువతతో కలిసి మైదానంలో సందడి చేయడంతో అక్కడి వాతావరణం మరింత ఉల్లాసంగా మారింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంచుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ప్రతిభలు ఉన్నాయని, ఇలాంటి టోర్నమెంట్లు వారికి తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదికలుగా నిలుస్తాయని అన్నారు.75 జట్లతో జిల్లాస్థాయిలో ఈ లీగ్ నిర్వహించడం నిర్వాహకుల కృషికి నిదర్శనమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కొనియాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా యువత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ క్రీడా రంగానికి ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. నియోజకవర్గంలో మరిన్ని క్రీడా మైదానాలు, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే సూచించారు. విజేతలకే కాదు పాల్గొన్న ప్రతి ఆటగాడికీ అభినందనలు చెందుతాయని అన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీల నిర్వాహకులు ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈూ జిల్లాస్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభంతో అల్లూరు ప్రాంతం మొత్తం క్రీడా సంబరాల్లో మునిగిపోయింది. రాబోయే రోజులలో జరిగే మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని, జిల్లాలోని ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ఈ టోర్నమెంట్ మంచి అవకాశంగా నిలుస్తుందని క్రీడాభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ అనిల్,అల్లూరి టిడిపి మండల అధ్యక్షులు బండి శ్రీనివాసరెడ్డి,టౌన్ పార్టీ అధ్యక్షులు కృష్ణ చైతన్య, టిడిపి నాయకులు మేడ కృష్ణారెడ్డి,రేబాల శంకర్ రెడ్డి, హరికృష్ణ యాదవ్, షేక్ నజీర్ భాష,మేడ శ్రీనివాసరెడ్డి, పెనుబల్లి శ్రీనివాస్ రెడ్డి,యారాశి మురళి, చెముకుల చెంగయ్య, క్రీడాకారులు,యువత భారీగా పాల్గొన్నారు.

## క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ సీసీ శిబిరం...

- పాల్గొంటున్న ప్రకాశం జిల్లా ఎన్ సీసీ క్యాడెట్లు
- పది రోజుల పాటు వివిధ అంశాలపై స్పెషల్ ట్రైనింగ్





**ఒంగోలు మే 24 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో :** ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ సీసీ ఏటీసీ ౩×ం స్పెషల్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ప్రారంభమైంది. పది రోజుల పాటు ఈ క్యాంప్ కొనసాగనుంది. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్న 600 మంది ఎన్ సీసీ క్యాడెట్లు ఈ ట్రైనింగ్ క్యాంప్ లో పాల్గొని వివిధ అంశాలపై ప్రత్యేకంగా అవగాహన పెంచుకోనున్నారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ క్యాంప్ 31 వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ మోహన్ వి, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ దినేశ్ ఎం ఎస్, ఎస్ ఎం సోమేశ్, కెప్టెన్ పి. అనిల్, ఏఎన్ వో క్యూఎమ్, ఏఎన్ వోలు ట్రైనింగ్ ఇస్తున్నారు.పది రోజుల క్యాంప్ లో భాగంగా టెంట్ పిచ్చింగ్, అబ్ స్టకిల్ ట్రైనింగ్, ఫైరింగ్, డ్రిల్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఆదివారం యువ ఆపద మిత్ర స్కిమ్ పై మాస్టర్ ట్రైనర్ టి. నాగలక్ష్మి, పి సురేశ్ శిక్షణ అందించారు.ఎన్ సీసీ క్యాడెట్లకు ట్రైనింగ్ ఎంతో ప్రాముఖ్యం అని, అలాంటి ట్రైనింగ్ క్యాంప్ క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అన్నారు. ఎన్ సీసీ క్యాడెట్లు కు క్రమశిక్షణ, దేశభక్తి , మెంటల్ హెల్త్, శరీర సామర్థ్యం పెంచుకునే విధంగా ఇలాంటి క్యాంప్స్ దోహద పడతాయి అని అన్నారు.

## పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి... దద్దాల నారాయణ యాదవ్....



**కనిగిరి మే 24 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో :** పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించారు.కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయంలో దద్దాల నారాయణ యాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిసి హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పార్టీ కమిటీకి సంబంధించి ఐడి కార్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన పత్రాలు అందజేసిన మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, వేసుపోగు గురుప్రసాద్, కస్తాల బాలాజీ, కోల గురు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పార్టీని బలోపేతం చేసే దిశగా అందరినీ యాక్టివ్ చేస్తూ కీలక బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా ఐక్యతగా పని చేయాలన్నారు. గ్రామ, వార్డు, బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు,నాయకత్వం చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రసారం చేయాలన్నారు.

## నిర్లక్ష్యనికి నిలువటద్దం పొదిలి మున్సిపాలిటీ....

ఎమ్మెల్యే ఆదేశాలు సైతం బేఖతారు...

20 రొజులుగా నీటి కొసం పడిగాపులు.

సాగర్ నీరు రాక, డిప్ బోర్ పనిచేయక.








**పొదిలి మే 24 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో :** మార్కాపురం జిల్లా పొదిలి మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యపు పనితీరుకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.స్థానిక తాలుకాఫీసు వీదిలో డిప్ బోర్ పైపులు చిల్లులుపడి నీరు వృదాగా పోతుండటంతో సిబ్బంది ఆవీదికి నీటిని నిలుపుదల చేశారు.గత 20 రొజులుగా పడుతున్న నీటి ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి స్దానిక టిడిపి బుత్ కన్వినర్ కారంశెట్టి కిషోర్ తీసుకెళ్ళి ప్రజాదర్బర్ లో వెళ్ళడించారు.తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటి సమస్యను తీర్చాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాలను పట్టించుకొని అధికారులు స్దానిక టిడిపి ప్రజా ప్రతినిధి ముందుకొచ్చి మరమత్తుల ఖర్చుసైతం నేనే భరాయిస్తానని భరొసా ఇచ్చిన మున్సిపల్ సిబ్బంది స్పందించక పొవడం విచారకరమణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత 20 రొజులుగా డిప్ బోర్ పనిచేయక పొవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగొలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు.అటు సాగర్ నీరు రాక,ఇటు డిప్ బోర్ పనిచేయక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు మొద్దనిద్ర వీడకపోతే ప్రభుత్వ యంత్రంగం అభాసుపాలైయ్యే ప్రమాదం దగ్గరలోనే ఉంది.అధికారులు స్పందించి తక్షణమే నీటి సమస్యను తొలగించాలని స్దానికులు కొరుతున్నారు.

## జిల్లాలో నాలుగు ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రిచే వర్చువల్ విధానంలో శంకుస్థాపన..జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయి కార్యక్రమం కింద విజయవాడలోని అంబేద్కర్ ఆడిటోరియం నుండి ఈ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 39 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మన జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో నాలుగు ఎంఎస్ఎంఈ పార్కులకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా, సంబంధిత ఎమ్మెల్యేలు అధ్యక్షులుగా శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో ప్రతిపాదిత ఎంఎస్ఎంఈ పార్కుల వివరాలు :

1. కొవ్వూరు నియోజకవర్గం -- పడుగుపాడు గ్రామంలో 14 ఎకరాలు 47 సెంట్ల విస్తీర్ణంలో 2. కావలి నియోజకవర్గం, దగదర్తి మండలం, ఉలవపాడు గ్రామం పరిధిలో 21 ఎకరాల విస్తీర్ణంలో 3. ఉదయగిరి నియోజకవర్గం, దుత్తలూరు మండలం దుత్తలూరు గ్రామం పరిధిలో 22 ఎకరాలు 43 సెంట్ల విస్తీర్ణంలో 4. గూడూరు నియోజకవర్గం -- కడివేడు గ్రామంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం లభించనుందని కలెక్టర్ తెలిపారు...

# డివిజన్ల విభజన పై సర్వత్ర నిరసన........

జెండావిధిని నాలుగు ముక్కలు......

అంతా అస్త వ్యస్తం.....

అభ్యంతరాలు వ్యక్తం చేసిన జనసేన, వైసిపి వామపక్షాలు,,

ఇదే విధంగా కొనసాగితే న్యాయపోరాటం తప్పదు అంటున్న ముస్లిం మైనార్టీలు.....





**నెల్లూరు సిటీ... మే, 24/(విజ్ఞాన్ ప్రతినిధి )..** నెల్లూరు నగరపాలక సంస్థ లోవార్డుల విభజన పై దుమరం రేగుతుంది... ఆదివారం అభ్యంత్ర ల కు చివరి రోజు కావడం తో ప్రతి పక్ష పార్టీ లైన వైసీపీ, సిపిఎం, సీపీఐ, పార్టీలు తమ అభ్యంత్రాలను తెలిపాయి. వైసీపీ ఎమ్మెల్సి పర్వాత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డికమిషనర్ ను కలిసి ఏమిటి విభజన అంటూ ఇది దుర్మార్గం గా చేసారాని విభజన తీరును తప్పు బట్టారు.. అలాగే సీపీఐ, సిపిఎం, పార్టీలు విభజన తీరును తప్పుపట్టాయి.. తక్షణ మార్పులు చేర్పు చేయకపోతే కమ్యూనిస్టు పార్టీలో ఆందోళనకు పెరుగుతాయని తెలియజేశారు.... కూటమి పార్టీల్లో భాగమైన జనసేన పార్టీకి చెందిన కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ కూడా విభజన తీరును విమర్శించారు..ఒక వినతి పత్రాన్ని అందజేశారు.. ఇది కాక తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు ఆశావాహులు సీనియర్ కార్పొరేటర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం...

కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే డివిజన్ల విభజనపై అభ్యంతర వ్యక్తపరచలేదు....

న్యాయపోరాటం తప్పదు.. సమీర్ ఖాన్.. నెల్లూరు నగరంలో ముస్లిం మైనార్టీలకు ఈ డివిజన్లో విభజన తీవ్ర అన్యాయాన్ని చేసిందని మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరుపై మండిపడ్డారు వైసీపీకి చెందిన మైనారిటీ నాయకుడు సమీర్ ఖాన్... కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చిన తదుపరి మీడియాతో మాట్లాడినా ఆయన ఈ డివిజన్లో విభజన నగరంలో గాని రూరల్ లో గాని ముస్లిం మైనార్టీలు పోటీ చేసేందుకు వీలు లేకుండా ఒక షాడో నాయకుడు కోసం దుర్మార్గపు విభజన చేశారని ఆయన ఆరోపించారు... ఈ విభజనపై తాము ఇచ్చిన అభ్యంతరాలను స్వీకరించి సమగ్ర విచారణ జరిపి సమన్యాయం చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని మీడియాకు తెలియజేశారు.... మొత్తం మీద నెల్లూరు నగరం వార్డుల విభజన తీవ్ర విమర్శలకు దారితీసింది... ముందు ముందు వార్డుల విభజన రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో వేసి చూడాల్సిందే..

## జనసేన సైదాపురం మండలం శ్రేణులు రేపు సోమవారం ఉదయం సైదాపురం తహశీల్దార్ కార్యాలయం వద్దకు గ్రీవెన్స్ అర్జీలు అందజేసేందుకు ఉదయం 10 గంటలకు వచ్చి ఉండాలి.



**సైదాపురం, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ , మే 24 :** సోమవారం ఉదయం 10 గంటలకు సైదాపురం తహశీల్దార్ వారు కార్యాలయం వద్దకు సైదాపురం మండలం లోని జనసైనికులు పార్టీ శ్రేణులు వచ్చి రెడీ గా ఉండాలనీ జనసేన మండల పార్టీ తరపున పిలుపు ఇచ్చినట్లు చింతలపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జనసేన మండలం తరపున మండలం లో నెలకొన్న సమస్యలు పైతహశీల్దార్ కి మండలం లో పలు గ్రామాల భూ సమస్యలు పై ప్రజా గ్రీవెన్స్ కు సంబంధించి అర్జీలు అందజేయడం జరుగుతున్నట్టు తెలిపారు . అలాగే ఎం పి డి ఓ ని విద్యుత్తు శాఖ ఏ ఈ ని పలు గ్రామాల లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కొరకు వారికి వినతులు అందించడం జరుగుతుందన్నారు. అక్కడ నుండి సైదాపురం లో పోలీస్ స్టేషన్ కు ఎస్ ఐ గా కొత్తగా యిటి వల బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ పి దుర్గా ప్రసాద్ రావు ని మర్యాద పూర్వకంగా జనసేన శ్రేణులు పరిచయం చేసుకోవడం కలవడం జరుగును. కావున మండలం లోని అన్ని గ్రామాల నుండి జనసేన శ్రేణులు అబిమానులు జన సైనికులు ఎక్కువ మందిగా విచ్చేసి పాల్గొని విజయవంతం చేయాలని సైదాపురం మండలం జనసేన పార్టీ సీనియర్ నాయకులుచింతలపల్లిరవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వల్లేపు యోహాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం



కారంపూడి పట్టణంలోని వల్లెపు యోహాన్ అనారోగ్యంతో మృతి చెందడంతో మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు వారి కుటుంబానికి 40000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి టిడిపి పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటదని టిడిపి కార్యకర్త అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని టిడిపి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి మండల అధ్యక్షులు ఉన్నం లక్ష్మి నారాయణ , మాజీ మండల అధ్యక్షులు చప్పిడి రాము , టౌన్ టిడిపి అధ్యక్షులు బొమ్మన శేషగిరి, టిడిపి సీనియర్ నాయకులు మునుగోటి సత్యం ,కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ,ంజూతీ కృష్ణ, బాలవెంకటేశ్వర్లు ,మహాకాళి శ్రీను,వల్లేపు బాబు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ రోజున గో వధ నిషేదమని జుమ్మా మసీదు కమిటీ మెంబర్స్ కు సైదాపురం ఎస్ ఐ సూచన



**సైదాపురం,విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ , మే 24 :** సైదాపురం పోలీస్ స్టేషన్ నందు ఆదివారం ఎస్ ఐ పి దుర్గాప్రసాద్ రావు సైదాపురం జుమ్మా మసీదు కమిటీ సభ్యులను పిలిపించి ఈ నెల 28న బక్రీద్ కి పండుగ జరుపుకునే సందర్భంగా గోనిషేధాన్ని నిషేధించమని సూచనలు ఇచ్చి పండుగని ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఆయన సూచన చేశారు.

## వాహనాల తనిఖీ చేసిన సైదాపురం ఎస్ఐ పి దుర్గాప్రసాద్ రావు



**సైదాపురం,విజ్ఞాన్ దిన : దినపత్రిక రిపోర్టర్, మే 24 :** సైదాపురంమండల కేంద్రం సమీపంలోని తూర్పు పూండ్ల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఎస్ఐ పి.దుర్గాప్రసాద్ రావు వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ పి దుర్గా ప్రసాద్ రావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్ఐ దుర్గాప్రసాద్

**సైదాపురం,విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ మే 24 :** బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సైదాపురం ఎస్ఐ .దుర్గాప్రసాద్ ముస్లిం మత పెద్దలకు సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు కుర్బానీ కార్యక్రమాలు జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ చేయరాదని తెలిపారు. గోవుల హత్య నిషేధంపై మండల ప్రజలకు సూచనలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని, సామరస్య వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, గురువులు పాల్గొన్నారు.

# ప్రతిభ విద్యార్దులను పోత్సహించడం అభినందనీయం-ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

విద్యార్దులకు అఖిల గాండ్ల తెలికుల

సంక్షేమ సంఘంచే పురస్కారాలు

కారక్రమంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు









అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం వారు ప్రతిభ విద్యార్దులను పోత్సహించడం అభినందనీయం అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు..వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.. రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ గ్రోసు గోపాలయ్య మొమోరియల్ గోల్డ్ మెడల్ ప్రధానోత్సవం నెల్లూరులోని మిని బైపాస్ రోడ్డు లోని కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అథిదులు గా హజరై విద్యార్దులకు ప్రతిభా పురస్కరాలను అందజేశారు. ఎంపీ మట్లాడుతూ గ్రోసు గోపాలయ్య హయంలో వృద్ధాశ్రమం నిర్వహించే వారని దాంట్లో తనకు భాగస్వామ్యం ఉందన్నారు.యువతను ప్రోత్సహించేలా ప్రతిభా పురస్కారాలు అందజేయడం ద్వారా పోటీ తత్వం పెరుగుతుందన్నారు.రాష్ట్రస్థాయిలో మొదటి ,ద్వితీయ గోల్డ్ మెడల్ , పురస్కారాలు అంజేయడంతో పాటు జిల్లాకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి ప్రతిభా పురస్కారాలు అందజేయడం సంతోషదాయకం ..తల్లిదండ్రలను గౌరవించుకునే సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయన్నారు...ప్రతి ఒక్కరూ సేవ గుణాలు అలవర్చుకోవాలన్నారు... దీర్ఘ కాలిక ప్రణాళికలతో మంచి మార్గం ఎంచుకుని అడ్డంకులను అధికమించి ఆదిశగా పయనించాలన్నారు..

విద్యార్దులను అభినందించుకోవడం స్ఫూర్తిగా తీసుకోవాలి-కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మట్లాడుతూ బీసీల అభ్యన్నతికి పెద్దపీట వేసే ప్రభుత్వం ఒక్క నారా చంద్రబాబు నాయిడు ప్రభుత్వమే అన్నారు.పదో తరగతి,ఇంటర్ లో ప్రతిభ చూపిన విద్యార్దులను బహుమతులు ఇచ్చి,ప్రోత్సహిస్తూ ,అభినందించడం గొప్పవిషయం అని , సంఘం వారు చేస్తున్న కార్యక్రమం సమాజం హర్షించ దగ్గ విషయం అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు.. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ కోసం సంఘం ఏర్పాటు చేసిన స్వర్గీయ గ్రోసు గోపాలకృష్ణయ్య సేవలు ప్రశంసనీయం అన్నారు... వారి కుమారుడు గ్రోసు సుబ్బారావు ,కమిటి సభ్యులు ఆయన పరం పరను కొనసాగించడం అభినందనీయం అన్నారు.వారి ఆశయాలను పంచుకోవడం గొప్పవిషయం అన్నారు.నేడు విద్యార్దులకు అందజేస్తున్నప్రతిభా పురస్కారాలు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆశిస్తున్నానన్నారు.భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.విద్యార్దులు రాబోవు రోజులలో సోషల్ మీడియా కు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలు దిశగా అడుగులు వేయాలన్నారు.వేమిరెడ్డి దంపతులను గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.వా

# తెలంగాణలో మారుతున్న వాతావరణం.. మూడు రోజుల పాటు వర్షాలు, ఈదురుగాలులు..



తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండలు కొనసాగుతుండగా.. మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతున్నాయి. దీంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు, ఉరుములు, ఈదురుగాలులు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి.. ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల వైపు మరింత ముందుకు సాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఇక మరోవైపు దక్షిణ బీహార్ పరిసర ప్రాంతాల నుంచి జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి కొనసాగుతోంది. ఇది సగటు సముద్ర మట్టానికి సుమారు 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో తెలంగాణలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

మూడు రోజుల వాతావరణ సూచన

ఆదివారం, సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. అదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఉష్ణోగ్రతలు తగ్గినా.. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం ఇంచుమించు ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశముందని పేర్కొంది.

కొన్ని జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

వర్షాల సూచనలు ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని కొన్ని ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడకూడదు. ఈదురుగాలుల సమయంలో అవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలి. మధ్యాహ్నం వేళల్లో అధిక ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తగినంత నీరు తాగుతూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి. రాబోయే రోజుల్లో నైరుతి రుతుపవనాల పురోగతితో తెలంగాణలో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

## విద్యార్ది దశ నుంచే లక్ష్యంతో ఉన్నత శిఖరాలు

-కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





జీవితం వేరు.. జీవనం వేరనీ.. నైతిక విలువలతో తల్లి దండ్రలు కన్నకలలు లక్ష్యంతో సాకారం చేసుకోవాలని జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి మైనారిటీ విద్యార్దులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు.జిల్లా ముస్లిం మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ



ప్రతిభ కనబరిచిన మైనార్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ షేక్ అబ్దుల్ అజీజ్, నగర మేయర్ దేవరకొండ సుజాత తో కలసి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అథిది గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కనబరిచి విద్యార్దులకు ప్రొత్సహకాలు అందించడం శుభ పరిణామన్నారు..పేద విద్యార్దుల కోసం తాము విపిఆర్ విద్య ఫౌండేన్ పేరు తో ఉచితంగా విద్య అందజేస్తున్నామన్నారు.తమ విద్యా సంస్థలో ఓ ఆటో డ్రైవర్ కుమార్తె ఆరో తరగతి లో చేరి నేడు పదో తరగతిలో 596 మార్కు సాదించిందని తెలిపారు. మనోధైర్యంతో ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు ..సోషల్ మీడియాను మంచి గా ఉపయోగించుకొని, ఉజ్వల భవిష్యత్తు అందుకోవాలని ఆకాక్షించారు.దేశానికి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు.కార్యక్రమంలో నెల్లూరు కార్పోరేషన్ కమిషనర్ నందన్ , జిల్లా ముస్లిం మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విద్యార్దులు పాల్గొన్నారు..

## చెస్ పోటీలు ఆత్మవిశ్వాసానికి ఆత్మ గౌరవానికి ప్రతీక

-ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



చెస్ పోటీలు ఆత్మవిశ్వాసానికి ఆత్మ గౌరవానికి ప్రతీక అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారం..జాతీయం అంధుల సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని బివినగర్ లో తరిమళ్ల నాగిరెడ్డి స్కూలు నందు మూడో రాష్ట్ర స్థాయి చెస్ సెలక్షన్స్ ఆదివారం



నిర్వహించారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధికోటంరెడ్డి గిరిధర్ రెడ్డి , ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లు ముఖ్యఅథిదులుగా పాల్గొన్నారు..ఈ సందర్భంగా వారు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు తమ అంథత్వాన్ని మర్చిపోయి జీవితంలో ఎన్నో గొప్ప విషయాల్లో ముందుకు సాగుతూ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఏ పనైనా చేయగలవని మనోధైర్యంతో ముందడుగులు వేస్తున్న క్రీడాకారులకు నా అభినందనలు తెలుపుతున్నామన్నారు.. వారి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు చేయూతను అందించడం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లక్ష్యం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ఎప్పుడు కూడా తమ విపిఆర్ ఫౌండేషన్ ప్రోత్సహిస్తూనే ఉంటుందన్నారు. చెస్ పోటోల్లో గెలుపొందిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నమన్నారు.. గెలుపు ఓటమి లతో తావు లేకుండా చెస్ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జాతీయ అంధుల సమాఖ్య సభ్యులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

## ప్రతిపక్షానివి పసలేని ఆరోపణలు-మంత్రి నారాయణ.

నెల్లూరులో విద్యపై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి

20 కోట్లతో అంతర్జాతీయ స్థాయి పాఠశాల నిర్మాణం

15 వేల మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యంగా అడుగులు

టీచర్ పోస్టుల భర్తీలో ప్రతిపక్షాల ఆరోపణలపై మండిపడ్డ మంత్రి







విద్యావ్యవస్థలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలవాలన్నది యువనేత నారా లోకేశ్ సంకల్పమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు.ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు.నెల్లూరు సిటీలో 15 వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో వ ు ు ం ద ు క ు సాగుతున్నామన్నారు. నెల్లూరులోని పరమేశ్వరి నగర్‌లో మంత్రి న ా ర ా య ు ణ పర్యటించారు . వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ పూల్‌తో కూడిన అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో



పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆశయాలకు అనుగుణంగా విఆర్సీ తరహాలోనే మరో 14 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో సిద్ధం చేస్తున్నామన్నారు.అవన్నీ పూర్తయితే 15 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. డిసెంబర్ నాటికి ఎండ్ టు ఎండ్ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు,అమృత్ పనులు పూర్తి చేసి, నగరాన్ని దుమ్ములేని నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. గత పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు.పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారనిఆరోపించారు.ప్రస్తుతం చంద్రబాబు పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. పారదర్శకంగా జరుగుతున్న ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చూసి ప్రతిపక్షాలు అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.పేద విద్యార్థుల పట్ల మంత్రి నారాయణ చూపుతున్న ప్రత్యేక చొరవను డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రశంసించారు. సొంత నిధులు, సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్న తీరు అభినందనీయమన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో స్కూల్ నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఇరుగాళ్లమ్మ సంఘం లోని మండలపరిషత్ పాఠశాలను పరిశీలించారు.అక్కడ నుంచి 14 వ డివిజన్ బాలాజీనగర్ చేరుకొని గ్రీనరీ,బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు.ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్న స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్ డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ ,రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,42వ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ ఖలీల్ అహ్మద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ అహ్మద్, పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి షేక్ కాలేషా, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఉమర్, నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇంతియాజ్,రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నౌషాద్,రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

Printed by: komalagunta Nageswara Rao D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, Published by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Owned by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Printed at : Deepak roshan Graphics Digital&Mutt colour printers, D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, published at :D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Editor : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District,